క్లుప్తంగా

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాభారతి

గంట్యాడ: బాల్య వివాహాల నిలుపుదలకు అందరూ కృషి చేయాలని సీడీపీఓ డి. ఉమాభారతి తెలిపారు. మండలంలోని పెనసాం గ్రామంలో బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అనధికార దత్తత చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా చైల్డ్‌హెల్ప్‌లైన్ ట్రోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు పాపాయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు లెంక మోహనరావు, మిషన్ వాత్సల్య చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం చిరత గట్టు జంక్షన్ వద్ద రహదారికి ఇరువైపులా చోటుచేసుకున్న ఆక్రమణలను అధికారులు శనివారం తొలగించారు. పంచాయతీ ఈఓ విశ్వనాథం, వైస్ సర్పంచ్ తాడ్డి సత్యంనాయుడు ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో ఆక్రమణల తొలగింపు జరిగింది. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకులు

గుర్ల: మండలంలోని జమ్ముపేట జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. చీపురుపల్లి నుంచి గూడేం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు యువకులు జమ్ముపేట జంక్షన్ వద్ద బ్సును తప్పించడానికి ప్రయత్నించగా వెనుక నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గూడేం గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మణరావు, చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన బెల్లాన రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదాతలే స్ఫూర్తి



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కేంద్రం ఇన్‌చార్జ్ లతక్క, ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): రక్తదాతలే రక్తదాన శిబిరాలకు స్ఫూర్తి అని ప్రజాప్రతినిధులు తెలిపారు. గరివిడిలో గల బ్రహ్మకుమారీస్, రాజయోగ మెడిటేషన్ సెంటర్‌లో ఇన్‌చార్జ్ లతక్క ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది దాతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వాకాడ శ్రీనివాసరావు, మీసాల విశ్వేశ్వరరావు, బమ్మిడి కార్తీక్, సారిపాక సురేష్, యువత, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక



అన్నపూర్ణ

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామానికి చెందిన తాళ్లపూడి అన్నపూర్ణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలో మూడు ఉద్యోగాలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌లో 29 ర్యాంక్.. ఎస్జీటీలో 53.. టీజీటీలో 44వ ర్యాంక్ సాధించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన అన్నపూర్ణ మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో గ్రామస్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.

మొదటి ప్రయత్నంలోనే..



శ్రీకాంత్

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ గ్రామానికి చెందిన కిల్లంపల్లి శ్రీకాంత్ స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే పీజీటీలో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్.. టీజీటీ విభాగంలో జోనల్‌స్థాయిలో 16వ ర్యాంక్ సాధించాడు. శ్రీకాంత్ తండ్రి సన్యాసిరావు కార్పెంటర్ కాగా.. తల్లి మంగ గృహిణి. ఒకేసారి మూడు ఉద్యోగాలక ఎంపిక కావడంపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు..

- వాడవాడలా వెలియనున్న మంటపాలు
- బలవంతపు చందాలతోనే ఇబ్బందులు
- గ్రామాల్లో గ్రూపుల వారీగా ఉత్సవాలు



గణనాథులు

శృంగవరపుకోట: జాతిని జాగృతం చేసేందుకు.. అందరినీ ఒకే తాటిపై నడిపేందుకు.. పరాయి పాలన తుద ముట్టించేందుకు స్వాతంత్ర్యోద్యమంలో మార్గమైన గణపతి నవరాత్రి ఉత్సవాలు.. నేడు గ్రామాల్లో ఐకమత్యాన్ని చాటిచెప్పడానికి వేడుకలుగా మారుతున్నాయి. భాద్రపద మాసం శుద్ధ చవితి నాడు (ఈ నెల 27న) గణనాథులను గ్రామాల్లో, పట్టణాల్లో కొలువు దీర్చేందుకు రంగం సిద్ధమైంది. నవరాత్రి వేడుకలకు ఇప్పటికే వేదికలు, మంటపాలు సిద్ధం కాగా, కళాకారుల చేతుల్లో గణనాథులు రంగులు పులుముకుంటున్నాయి.

చందాలతో దందా..

గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు యువత గ్రామాల్లో చందాల పేరుతో దందాలు చేస్తున్నారు. చందా ఇవ్వాల్సిందేనంటూ పదే పదే ఒత్తిళ్లు చేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడిన సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. గ్రామాల్లోని యువతను కాదనలేక, తగాదా పెట్టుకోలేక చందాలు చెల్లిస్తున్నారు. ఒకే గ్రామంలో వేర్వేరుగా గణపతులను ఏర్పాటు చేస్తే తటస్తులకు కత్తి మీద సామే అవుతోంది. కులాల వారీగా, పార్టీల వారీగా, వర్గాల వారీగా గణపతులను ఏర్పాటు చేయడం కంటే అందరూ కలిసికట్టుగా ఉత్సవాలు నిర్వహించుకుని ఐకమత్యంగా ఉండాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శబ్ద కాలుష్యం..

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాల్సి ఉండగా.. యువత అత్యుత్సాహం వల్ల శబ్ద కాలుష్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారు యువతను తమ ఆధిపత్యం కోసం ప్రోత్సహిస్తుండడం వల్ల ప్రజలు ఎవ్వరికీ చెప్పుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. పోలీసులు నిర్ణీత సమయం వరకే మైక్‌సెట్ వేసుకోవాలని.. ఇన్ని డిసెబుల్స్ కంటే ఎక్కువ సౌండ్ పెట్టకూడదని సూచిస్తున్నా ఆచరణలో అమలు కావడం లేదనేది బహిరంగ రహస్యం. కనీసం ఈ ఏడాదైనా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దేశం కోసం నాటి నవరాత్రులు..

భారతీయుల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చేందుకు.. అవగాహన, ఐక్యత పెంచేందుకు 1893లో మహారాష్ట్రలోని పూణేలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా, బహిరంగంగా నిర్వహించేందుకు ముందడుగు వేశారు. నాడు జాతిని ఒక్కటి చేసిన ఉత్సవాలను నేటికీ కొనసాగిస్తూ యువత తమ ఐకమత్యాన్ని చాటి చెబుతున్నారు.

కూటమి సర్కారుది నయవంచన పాలన

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు
- ముసిరాంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'



కొత్తవలస: ముసిరాం గ్రామంలో కూటమి మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు తదితరులు

కొత్తవలస: కూటమి సర్కారు నయవంచన పాలనకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు ఆరోపించారు. మండలంలోని ముసిరాంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలపై వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలు అమలు చేయకపోగా, ఉన్న పథకాల్లో కోత విధిస్తోందని ఆరోపించారు. దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్యారామస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, రామలింగాపురం ఎంపీటీసీ సభ్యుడు లెంక వరహాలు, పార్టీ నాయకులు చింతల పైడినాయుడు, దమ్ము రమణ, పల్లా భీష్మ, నొడగల వెంకటరమణ, గొరపల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మోసం.. చంద్రబాబు నైజం



గంట్యాడ: కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహమూర్తి, జైహిందకుమార్

గంట్యాడ: మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని పెంట శ్రీరాంపురంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కూటమి మోసాలను..చంద్రబాబు అసమర్థ పాలనను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, ఉపాధ్యక్షుడు వర్రి మల్లయ్య, సర్పంచ్ కరక గౌతమి, పార్టీ నాయకులు కరక మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు తొలగించడమే సుపరిపాలనా..?

- వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఎన్నో ఏళ్లుగా పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులను తొలగించడం సరికాదని.. దివ్యాంగులను రోడ్డుమీదకు ఈడ్చడమేనా సుపరిపాలన అని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. గరివిడి మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల నాయకులు మాట్లాడుతూ.. మండలంలో 1498 దివ్యాంగుల పింఛన్లు ఉండగా వాటిలో 327 మంది పింఛన్లు తొలగిస్తూ అధికారులు నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అదే విధంగా 34 మెడికల్ పింఛన్లు ఉండగా అందులో తొమ్మిది పింఛన్లను తొలగించారు. అధికారంలోనికి వచ్చి 14 నెలలు గడిచినా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని.. ఇప్పుడు ఉన్న పించన్లను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత పెన్షనర్ల తరఫున శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బొత్స హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్న విషయాన్ని డీసీసీబీ చైర్మన్ కమిడి నాగార్జున తెలుసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.శ్రీరాములనాయుడు, రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీ ఎడ్ల అప్పారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, నాయకులు గుడివాడ తమ్మినాయుడు, కడుమల రాంబాబు, ఎల్లంటి పోలీస్‌నాయుడు, బమ్మిడి కార్తీక్, ముద్దాడ రమణ, అలమండ అప్పలనాయుడు, గుంటుబారిక లక్ష్మణ, జేఆర్‌సీ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి

- మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ కనకలక్ష్మి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

శృంగవరపుకోట: విద్యార్థి దశ నుంచే వ్యవస్థలోని అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ చైర్‌పర్సన్ కుమారి బి.కనకలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు – నివారణోపాయాలు'.. 'బాల్యవివాహాలు – నిషేధం' అన్న అంశాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. సమాజంలో అంటరానితనం కనుమరగవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, వేధింపులను ఎదుర్కోవడానికి ఉన్న చట్టాలను వివరించారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సూరిదేముడు, కార్యదర్శి బీవీఎస్ రామారావు, న్యాయవాదులు బి.త్రిమూర్తులు, మండా కామేశ్వరరావు, అల్లు సత్యాజీ, బి.సత్యనారాయణ, వారాది ఈశ్వరరావు, డబ్ల్యూఎస్ శర్మ, బి.రామకృష్ణ, ఆర్. సత్యనారాయణ, తదితరులు ఎస్టీ, ఎస్టీల రక్షణ చట్టాలు, చైల్డ్ మ్యారేజ్, పోక్సో, అట్రాసిటీ యాక్ట్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులుకు నివాళులు



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొండపల్లి: మండల రెవెన్యూ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ధీశాలి టంగుటూరి



కొత్తవలస: ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, మాజీ ఎంపీపీ, ఉద్యోగులు

కొత్తవలస: బ్రిటీష్ దొరల తుపాకి గుండుకు తన గుండెను ఎదురొడ్డిన ధీశాలి టంగుటూరి ప్రకాశం పంతులు అనిఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో టంగుటూరి ప్రకాశం పంతుల జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, వెలుగు, ఎంపీడీఓ కార్యాలయాల అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు కోర్టు ఉత్తర్వులు వర్తించవా..?



ఆందోళన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: కలెక్టర్ గారికి కోర్టు ఉత్తర్వులు వర్తించవా..ఆయన చట్టాలకు, కోర్టులకు అతీతులా అంటూ ఎమ్మెల్సీ రఘురాజు ప్రశ్నించారు. శనివారం మధ్యాహ్నం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 60 రోజులకు పైగా జిందాల్ నిర్వాసితులు ఆందోళనలు చేస్తున్నా కలెక్టర్ గారు బాధితుల గోడు వినేందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ఒక బాబా పిలిస్తే పరుగు పరుగున వచ్చి కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో రోడ్డు నిర్మాణం కోసం భూమిపూజ చేసిన కలెక్టర్‌కు నిర్వాసితుల బాధలు పట్టవా అని అన్నారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

కొనసాగిన నిరసన..

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితుల నిరసన శనివారం కూడా కొనసాగింది. బొడ్డవర వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్న సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ రాఘవులు, అన్నపూర్ణ

చీపురుపల్లి: పట్టణంలోని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సేవా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ఎస్.రాఘవులు, బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి రాజయోగిని బీకే అన్నపూర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా 113 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి శాంతి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- ఎంపీడీఓ భాస్కరరావు



మెరకముడిదాం: చినబంటుపల్లిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న అధికారులు



జామి: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు, తదితరులు



చీపురుపల్లి: కొత్త అగ్రహారం వద్ద పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న డీఎల్‌డీఓ కె. హేమసుందరరావు, తహసీల్దార్ ధర్మరాజు, తదితరులు



లక్కవరపుకోట: చెత్తను రిక్షాలో వేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, తదితరులు



గజపతినగరం: గంగచోళ్లపెంటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు



దత్తిరాజేరు: కేజీబీవీలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ విమలారాణి, తదితరులు



శృంగవరపుకోట: కొట్టాంలో ర్యాలీ చేస్తున్న హైస్కూల్ విద్యార్థులు



వేపాడ: చినగుడిపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ రామునాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవికుమార్

మెరకముడిదాం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీఓ గొర్లె భాస్కరరావు అన్నారు. మండలంలోని చినబంటుపల్లిలో 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి..

జామి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఎస్.అప్పలనాయుడు తెలిపారు. మండల కేంద్రంలో 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అధికారులతో సమావేశమై కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఉమా, ఎంఈఓ జయశ్రీ, వెలుగు ఏపీఎం అప్పలనాయుడు, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పాల్గొనాలి..

లక్కవరపుకోట: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. మండలంలోని గనివాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ సింగంపల్లి అప్పారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

వేపాడ: పుట్టిన రోజున పది మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని జియో వ్యవస్థాపకుడు బి. రామకృష్ణ పిలుపునిచ్చారు. ముకుందపురం గ్రామానికి చెందిన గోపిశెట్టి అనూషా శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని కోనేరు చుట్టూ ఇరవై మొక్కలు నాటారు. కార్యక్రమంలో వెంకటరావు, నాగేశ్వరరావు, రేవతి, రవి, జియో వలంటీరు ఎ. ప్రభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు నిల్వ చేస్తే చర్యలు

కొత్తవలస: ఎరువులు, పురుగు మందులను అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అప్పలరాజు అన్నారు. మండల కేంద్రంలో గల పలు ఆగ్రో ఏజెన్సీలను స్థానిక ఎస్సై ప్రసాద్‌రావుతో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులను అధిక ధరలకు విక్రయించకూడదన్నారు. సీఎస్‌డీటీ అనంత్‌కుమార్ పాల్గొన్నారు.

చర్చి నిర్మాణంపై చర్యలు తీసుకోండి

బొండపల్లి: మండల కేంద్రంలోని సాయికృపా లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించాల్సి ఉండగా.. చర్చి నిర్మిస్తున్న బి.స్వాతి, ఆమె భర్త అనిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్‌సుందర్, కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ రఘుపతిరావు, తహసీల్దార్ రాజేశ్వరరావులను శనివారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. దీనికి అధికారులు స్పందిస్తూ స్థల పరిశీలన చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మెరకముడిదాం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అజిత్‌బాబు అన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది రామారావు, వర్మ, ప్రిన్సిపాల్ గౌష్యాబేగం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్ట్‌ల పంపిణీ

జామి: మండలంలోని భీమసింగి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డీఈఓ యు.మాణిక్యాలనాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థి గార ఈశ్వరరావు (ఏఆర్ కానిస్టేబుల్) తన జన్మదినం సందర్భంగా 143 మంది విద్యార్థులకు టీ షర్టులు సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.చంద్రశేఖర్, సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి, ధనియాల పైడిరాజు, గేదెల రమణబాబు పాల్గొన్నారు.

సందర్శన

వేపాడ: మండలంలోని క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు శనివారం పలు పాఠశాలలను సందర్శించారు. వేపాడ క్లస్టర్ హెచ్‌ఎం ఎస్.ఎస్‌వల్లీ వల్లంపూడి పాఠశాలను.. సోంపురం క్లస్టర్ హెచ్‌ఎం బీపీపీ రాజు సోంపురం పాఠశాలను.. ఎంఈఓ బాలభాస్కరరావు చినగుడిపాల ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పావని



రెడ్డి పావనిని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన రెడ్డి పావని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి నియమితులయ్యారు. దీంతో స్థానికులు, బీజేపీ నాయకులు శనివారం సాయంత్రం ఆమెను తన స్వగృహంలో కలిసి అభినందించారు. అభినందనలు తెలియజేసిన వారిలో పార్టీ నాయకులు ఆరిశెట్టి ఏడుకొండలు, ఎం.భాస్కరరావు, తదితరులున్నారు.

మద్యంతో ఒకరి అరెస్ట్

శృంగవరపుకోట: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒకరిని పోతానపల్లి జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అరెస్ట్ చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. పోతనాపల్లికి చెందిన పోలిశెట్టి పాండురంగ అనే వ్యక్తి నుంచి 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.